www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:35 SUNDAY ,JUNE 14,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 35 ఆదివారం 14 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-



## వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి వ్యతిరేకంగా లేఖ రాస్తాం

**కేబినెట్‌లో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం..**

**60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదు..**

వివరాలు2లో



## కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం

**వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: మహేశ్ గౌడ్**

- మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ
- ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత
- అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్

# ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది


**రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో చర్యలు తీసుకుంటున్నామని, సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని,రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు.**





హంస కలం వార్త :ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తు ందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ,ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండల ంలోని గూడెంలో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునరు ద్ధరణ పనులను రాష్ట్ర ఐ.టి, ఎలక్ట్రానిక్స్, కమ్యూని కేషన్స్, పరిశ్ర ఓమల శాఖ మం త్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మం త్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసన మండలి సభ్యులు 2లో

**మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు.. 335 మందికి ఆర్డర్లు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి** 2



## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్..

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు రూ.50 వేల జరిమానా
- కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు హైకోర్టు ఆగ్రహం
- యూసఫ్‌గూడ భూవివాదంలో యథాతథస్థితి ఉల్లంఘన
- జరిమానా చెల్లించాకే కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

హంస కలం వార్త : భూవివాదానికి సంబంధిం చిన కేసులో కోర్టు ఉత్తర్వులను ధిక్కరిం చినందుకు 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు రూ. 50 వేల జరిమానా విధిస్తూ జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ కింద ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ -2లో

## కాంగ్రెస్ ప్రభుత్వం పై కేటీఆర్ ఫైర్




- కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు
- తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరత పై విమర్శలు
- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

## పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు






## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

హంస కలం వార్త జూన్ 13: జిల్లా ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని,ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటు

# భారీ వర్ష సూచన

**"కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో హై అలర్ట్ ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి**






హంస కలం వార్త : రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగర వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే -మిగతా2లో

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

హంస కలం వార్త :తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికా రికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమ యంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణ లు వచ్చిన నేపథ్యం లో సిట్ విస్తృత -మిగతా2లో



## కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం..

-మొదటిపేజీ **తరువాయి:**మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్ట్‌లను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్..

-మొదటిపేజీ **తరువాయి:** హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మండలం, యూసఫ్‌గూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 45లో ఉన్న రెండెకరాల భూవివాదంపై మహ్మద్ షఫాహతుల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో న్యాయస్థానం యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని గతంలో ఆదేశాలు ఇచ్చింది. అయితే, ఈ ఆదేశాలను ఉల్లంఘించి అధికారులు ప్రహరీ గోడ కూల్చివేసి, కంచె ఏర్పాటు చేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై తాజాగా జరిగిన విచారణలో, కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి చివరి అవకాశం ఇచ్చినా 'హైడ్రా' స్పందించకపోవడంపై జస్టిస్ శ్రవణ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేటస్ కోను ఉల్లంఘించడాన్ని తప్పుబడుతూ కమిషనర్‌కు జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని చీఫ్ జస్టిస్ రిలీఫ్ ఫండ్‌కు చెల్లించాలని, ఆ తర్వాతే కేసులో కౌంటర్ అఫిడవిట్‌ను స్వీకరించాలని రిజిస్ట్రీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## భారీ వర్ష సూచన..

-మొదటిపేజీ **తరువాయి:** వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు.

శాఖల మధ్య సమన్వయం అవసరం

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ , హైడ్రా, విద్యుత్ శాఖ , వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ , స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

-మొదటిపేజీ **తరువాయి:** ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్..

-మొదటిపేజీ **తరువాయి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రొజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

-మొదటిపేజీ **తరువాయి:**శనివారం మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని గూడెంలో గల శ్రీ రమా సహిత సత్యనా రాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను రాష్ట్ర ఐ.టి,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసన మండలి సభ్యులు దండే విఠల్,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి,రామగుండం నియోజకవర్గాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,గండ్ర సత్యనారా యణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మంచిర్యాల,రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహం కాళి స్వామి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తం గా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయ లతో చర్యలు తీసుకుంటున్నామని, సరస్వతి పుష్కరాలను విజయవం తంగా నిర్వహించడం జరిగిందని,రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు 802 కోట్ల రూపాయలతో ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు 70 కోట్ల రూపాయల నిధులతో గూడెం దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసా గుతుందని,పిప్రి వేదికగా రాష్ట్ర ముఖ్య మంత్రి చే గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూ రు చేసి 37 రోజుల వ్యవధిలోనే పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తం గా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం,వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా గూడెం గుట్ట పరిధిలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు.విద్య,వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దని, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో విద్య,వైద్యం, వ్యవసాయ,ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిలో నియోజకవర్గ శాసనసభ్యులు కృషి అభినంద నీయమని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్తులో ప్రజల కు ప్రయోజన కరంగా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ఐ.టి.శాఖ మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు .రాబోవు గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంద ని తెలిపారు.మంచిర్యాల శాసన సభ్యులు మాట్లాడు తూ...గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు.నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట,హాజీపూర్ మండలాల తో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.అనంతరం పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 70 లక్షల రూపాయల మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సంఘ భవనాల నిర్మాణం,లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో సి.సి.రోడ్డు పనులు,2 కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలో 58 ఓట్ల రూపాయల అంచనా నిధులతో ఆలయ పున:నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, లక్షెట్టిపేట,దండేపల్లి మండలా లలోని మోదెల, ద్వారక,గుడిరేవు గ్రామాల సమీపంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమవైపున 74 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా నిధులతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి వ్యతిరేకంగా లేఖ రాస్తాం: మంత్రి సీతక్క

-మొదటిపేజీ **తరువాయి:** కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క ఈరోజు (శనివారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు.

**కేబినెట్‌లో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం..**

ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంభిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హామీ ద్వారా చేపడుతామని తెలిపారు.

**60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదు..**

పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## మంచిర్యాలలో సింగరేణి కారుణ్య నియామకాలు..

-మొదటిపేజీ **తరువాయి:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఇవాళ కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

-మొదటిపేజీ **తరువాయి:** జిల్లా ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని,ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.శనివారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో పర్యటించిన ఆయన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులు నైతం కవిత-సోము, తొడసం సుదర్శన్-మధుబాయి, సీతాబాయి-దేవురావు కుటుంబాలకు చెందిన నూతన గృహాలను మంత్రి పరిశీలించి, ప్రభుత్వ సహాయంతో సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ...రిమ్మ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటి వరకు 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హులైన కుటుంబాలకు అదనపు గృహాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**విద్యాభివృద్ధికి ప్రాధాన్యం**

గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు,సామాజిక భద్రతా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు.రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చిట్టచివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నా మని తెలిపారు.గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి,ప్రజాప్రతి నిధులు,వివిధ శాఖల అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు

-మొదటిపేజీ **తరువాయి:** పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.


# సంపాదకీయం


## యుద్ధం మధ్యలో వాలిన 'పెట్టుబడి' రాబందులు!

మార్క్సిస్ట్ దృష్టికోణంలో యుద్ధం అనేది అనుకోకుండా అకస్మాత్తుగా జరిగేది కాదు. పెట్టుబడిదారీ విధానం విస్తరణలో అది ఒక దశ. మార్కెట్లు స్తంభించిపోయినప్పుడు, 'పెట్టుబడి' కొత్త ప్రాంతాలను వెతుక్కుంటుంది. ఆ సందర్భంలో రాజ్యం, కార్పొరేట్ సంస్థలు తమ వర్గ ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తాయి. ప్రజలకు యుద్ధం అంటే మరణం. కానీ, పెట్టుబడికి అది లాభం. రాజ్యానికి అది నియంత్రణ సాధనం. రాజకీయ నాయకులకు అది భవిష్యత్తు అవకాశాలకు మార్గం. ఇప్పటి రోజుల్లో యుద్ధం కేవలం సరిహద్దుల్లోనే కాదు. అది స్టాక్ మార్కెట్లలో, రక్షణ ఒప్పందాల్లో, డేటా సెంటర్లలో, చమురు మార్కెట్లలో, డిజిటల్ ప్లాట్‌ఫాంలలో కూడా జరుగుతుంది. అందుకే యుద్ధం కేవలం విధ్వంసమే కాదు; కొన్ని కార్పొరేట్ సంస్థలకు, కొందరు వ్యక్తులకు అది బంగారు అవకాశాలను తెరిచిపెట్టే ద్వారం! ఒకవైపు ఇరాన్ పైన బాంబులు పడుతూ ఉంటే, మరోవైపు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఆయుధ తయారీ కంపెనీల షేర్లు విపరీతంగా పెరుగుతూ ఉంటాయి. యుద్ధం నుంచి ఎవరు లాభపడుతున్నారనే విషయాన్ని అర్థం చేసుకోకుండా, శాంతి గురించి జరిగే ఎటువంటి చర్చలైనా అసంపూర్తిగానే ఉంటాయి. యుద్ధంలో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారన్న దానికంటే, యుద్ధం వల్ల ఎవరు ధనవంతులు అవుతున్నారన్నది అత్యంత కీలకం. యుద్ధం కొందరికి లాభసాటి వ్యాపారం. 'క్షిపణులు' వారికి ఆయుధాలు మాత్రమే కాదు; అవి వారికి ప్రభుత్వ కాంట్రాక్టులు, రాజకీయ ఎదుగుదలకు నిచ్చెనమెట్లు. యుద్ధం ఎంతకాలం కొనసాగితే వారికి అంత లాభం. అందుకే ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో యుద్ధం దౌత్యపరమైన వైఫల్యం కాదు. అది ప్రణాళికాబద్ధమైన, లాభాలను ఆర్జించే ఆర్థిక వ్యవస్థలో భాగం. ఏ యుద్ధం నుంచైనా ఎక్కువ లబ్ధి పొందేవారు-- అధికార కేంద్రాలపై పట్టున్నవారు, ఆ పట్టును యుద్ధకాలంలో తమ ప్రైవేట్ ఆస్తుల పెరుగుదలకు, ఆర్థిక సామ్రాజ్యాల విస్తరణకు ఉపయోగించుకోగలిగినవారు మాత్రమే. దీనికి మంచి ఉదాహరణ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుటుంబం. తండ్రి యుద్ధాన్ని ప్రారంభిస్తాడు, కొడుకులు సొమ్ము చేసుకుంటారు. డోనాల్డ్ ట్రంప్ ఇద్దరు కుమారులు-- డోనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ ఇటీవల బాగా వార్తల్లోకి ఎక్కారు. ఇరాన్‌తో యుద్ధంలో మునిగి ఉన్న గల్ఫ్ దేశాలకు 'డ్రోన్ ఇంటర్‌సెప్టర్'లను విక్రయిస్తున్న ఒక డ్రోన్ తయారీ కంపెనీతో వీరిద్దరికీ సంబంధం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈ డ్రోన్లు ఇరాన్ దాడులను సమర్థంగా ఎదుర్కొంటున్నట్టు చేసే ప్రచారంలో భాగంగా గల్ఫ్ దేశాలలో ఈ కంపెనీ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించింది. ఈ కంపెనీతో ట్రంప్ సోదరులు చేసుకున్న ఒప్పందం వల్ల, కంపెనీలో వాటాలతో సహా వారు భారీగా లాభం పొందారు. యుద్ధం ద్వారా భారీగా లాభం పొందిన అమెరికన్ అధ్యక్షుల కుటుంబాల్లో డోనాల్డ్ ట్రంప్ కుటుంబం మొదటిది అని వైట్‌హౌస్ లాయర్ రిచర్డ్ పెయింటర్ వ్యాఖ్యానించారు. ట్రంప్ కుటుంబం తన వ్యాపార వ్యూహాన్ని కూడా మార్చుకుంది. హోటళ్లు, గోల్ఫ్ కోర్సెస్ మాత్రమే గాక, వారిప్పుడు క్రిప్టో కరెన్సీ, రాకెట్ స్పేర్ పార్టులు, అత్యంత శక్తిమంతమైన విండ్ టర్‌బైన్లు, రోబోట్లు, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఇరాన్‌పై దాడి ప్రారంభానికి పదకొండు రోజుల ముందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఇజ్రాయెల్‌కు చెందిన డ్రోన్ కంపెనీలో ఎరిక్ ట్రంప్ పెట్టుబడులు పెట్టారు. అమెరికా సైనిక ఖర్చులు, డ్రోన్ల యుద్ధ ఖర్చుల పెంపుదల తదితర విషయాలను ఆ దేశ అధ్యక్షుడైన వారి తండ్రి ట్రంప్ నిర్ణయిస్తూ ఉంటాడు. కుమారుడేమో పెంటగాన్ కాంట్రాక్టులతో కూడిన డ్రోన్ల యుద్ధ కంపెనీలలో పెట్టుబడులు పెడుతుంటాడు. ఎరిక్ ఒక్కరే కాదు, డోనాల్డ్ ట్రంప్ జూనియర్ కూడా మరో డ్రోన్ కంపెనీ సలహామండలిలో చేరారు. ఈ విధంగా, మిలిటరీ టెక్నాలజీ రంగంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బలంగా తిష్ఠ వేశారు. ఆధునిక యుద్ధంలో టెక్నాలజీ కంపెనీల పాత్ర వేగంగా పెరిగింది. ఒకప్పుడు కేవలం సంప్రదాయ రక్షణ సంస్థలకే లాభం వచ్చేది; ఇప్పుడు సిలికాన్ వ్యాలీ కంపెనీలు కూడా ఇందులో ఉన్నాయి. డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంల ద్వారా యుద్ధంలో కీలకపాత్ర పోషిస్తున్న కంపెనీలు భారీగా లాభాలు పొందుతున్నాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత వాటి షేర్ల విలువ కూడా విపరీతంగా పెరిగింది. యుద్ధ ఆర్థిక వ్యవస్థలో టెక్ కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను రక్షణ విభాగాలతో కలిపి ఉపయోగిస్తున్నాయి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఈ రంగంలోకి వెళ్తున్నాయి. యుద్ధం కేవలం కంపెనీలకే కాదు; ప్రభుత్వాలకు కూడా లాభదాయకం. పాలకులు తమ రాజకీయస్థితిని మెరుగు పరచుకోడానికి యుద్ధాన్ని వాడుకుంటారు. దేశీయ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి యుద్ధం ఉపయోగపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. చరిత్రంతా ఇదే జరుగుతోంది. యుద్ధం వల్ల ధనిక దేశాలు మరింత ధనికంగా మారతాయి; పేద దేశాలు మరింత పేదవి అవుతాయి. మరి అసలు ప్రశ్న, ప్రపంచశాంతి? యుద్ధం ఒక వ్యాపారంగా విలసిల్లుతున్నంత కాలం ప్రపంచశాంతి కలగానే మిగిలిపోతుంది.

# పునర్జాగృత కాంగ్రెస్సే ప్రతిపక్ష బలం





భారతీయ సినిమా చరిత్రలో సీక్వెల్స్ అరుదుగా విజయం సాధించాయి. ప్రేక్షకులు సాధారణంగా ఒరిజినల్ హిట్ సినిమాను చూస్తారు, ఆదరిస్తారు. సీక్వెల్ చూడవచ్చేటప్పటికి కొత్తదనం తగ్గిపోతుంది. కథ నిస్సారమైనదిగా అనిపిస్తుంది. ప్రారంభ సినిమాలో పులకింపజేసిన అనుభూతి అంతగా పునరావృ తమవదు. ఇటీవల బాక్సాఫీసు రికార్డులు బద్దలు కొట్టిన 'ధురంధర్' అందుకొక మినహాయింపే అయినా చాలా సీక్వెల్స్ మొదటి హిట్ సినిమా మ్యాజిక్‌ను పునః సృష్టించడంలో విఫలమవు తున్నాయి. 2024 సార్వత్రక ఎన్నికలలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీని ఆశ్చర్యకరంగా సవాల్ చేసిన ఇండియా కూటమి.. 2029 సార్వత్రక ఎన్నికలలోనూ అటువంటి పోటీని సమర్థంగా ఇవ్వగలదా? ఇవ్వగలదనే నమ్మకాన్ని ఇండియా కూటమి 2.0 ఏమాత్రం ఇవ్వలేకపోతోంది. దానికి బదులుగా అంతర్గత నిర్మాణాత్మక ప్రక్షాళనతో దేశ పురాతన రాజకీయ పక్షమైన కాంగ్రెస్‌ను పునశ్శక్తిమంతం చేయవలసిన అవసరమున్నదని చాలామంది భావిస్తున్నారు. మరి గత రెండు సంవత్సరాలలో యమునా నదిలో చాలా నీరు ప్రవహించింది. ప్రధాన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పలు పరాజయాలను మూటగట్టుకున్నది. ఇండియా కూటమికి వెన్నెముకగా నిలిచిన వివిధ ప్రాంతీయ పార్టీలు గణనీయంగా బలహీనపడ్డాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత తిరుగుబాట్లతో కుదేలయిపోతోంది. మహారాష్ట్రలో శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్) చీలిపోయాయి. ఢిల్లీలో అధికారాన్ని కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ తన ప్రాసంగికతను నిలుపుకునేందుకు నానా ప్రయాసలు పడుతోంది. ఇంకా ఇతర రాష్ట్రాలలోని ప్రతిపక్షాలు అధికారం కోసం ఎంతగా పోరాడుతున్నాయో మనుగడను కాపాడుకునేందుకు అంతగా ప్రాకులాడుతున్నాయి. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమై తమ భావి కార్యాచరణ గురించి సమాలోచనలు జరిపాయి. ఉమ్మడి లక్ష్యం, దార్శనికతతో కంటే 2029 లోక్‌సభ ఎన్నికల అనంతరం నరేంద్రమోదీ తిరిగి అధికారానికి రాకుండా నిలువరించాలనే ప్రగాఢ ఆకాంక్షతో మళ్లీ కలగలసిన రాజకీయ శక్తుల సంకీర్ణంగా ఇండియా కూటమి కనిపిస్తోంది. సమస్యేమిటంటే రాజకీయాలు ఎంతగా అంకగణిత వ్యవహారాలో (ఓట్ల వాటా, సీట్ల సంఖ్య తదితరాలు) అంతగా ప్రజలను సమ్మోహనపరిచే సామర్థ్యం, భావోద్వేగ సంబంధాలతో ముడివడి ఉన్న విషయాలు. సమావేశాలు, సంప్రతింపులతో ఎన్నికల పొత్తులు కుదుర్చుకోవచ్చు. అయితే ఆ పొత్తులలో అవకాశవాదం ఎంతగా ఉన్నదో ఓటర్లు ఇట్టే గ్రహించగలరు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తృణమూల్ కాంగ్రెస్ పాలన అవినీతిమయమని, బీజేపీతో చాటుమాటు ఒప్పందాలు కుదుర్చుకున్నదని రాహుల్‌గాంధీ ఆరోపించారు. మరి ఇప్పుడు తృణమూల్, కాంగ్రెస్ నాయకులు ఒకే వేదిక మీద కనిపిస్తున్నారు! కాంగ్రెస్‌కు విరుద్ధంగా ప్రజలకు బీజేపీ ఒక స్పష్టతనిస్తోంది. ఆ పార్టీ భావజాలంతో మీరు ఏకీభవించకపోవచ్చు, దాని పద్ధతులను మీరు వ్యతిరేకించవచ్చు. అయితే ఆ పార్టీకి నేతృత్వం వహిస్తున్నది ఎవరో ఓటర్లకు తెలుసు, ఆ పార్టీ ఏ లక్ష్యాల కోసం పనిచేస్తుందో బాగా తెలుసు, అధికారం ఎవరి చేతుల్లో ఉందో కూడా మరీ తెలుసు. వర్తమాన భారత రాజకీయాలలో బీజేపీ ప్రాబల్యం కేవలం నరేంద్ర మోదీకి లభిస్తున్న విశేష ప్రజాదరణ ఫలితం కాదు. ప్రతిపక్షం తరచూ చీలికలు పీలికలై పోతుండడం కూడా అందుకొక కారణం. సదా అంతర్గత జగడాలతో, అనిశ్చిత నాయకత్వాన్ని అందిస్తున్న ప్రతిపక్షం వైపు ఓటర్లు ఎందుకు మొగ్గుచూపుతారు? ఈ వాస్తవం దృష్ట్యా ప్రతిపక్షం తన విధానాలు, తీరుతెన్నులను మౌలికంగా మార్చుకోవల్సిన అవసరం ఉన్నది. ప్రతిపక్షాలు ఎదుర్కొం టున్న సవాలు బహుశా ఇండియా కూటమిని పునరుద్ధరించడం కాకుండా మరింత పాత రాజకీయ శక్తి అయిన కాంగ్రెస్ వ్యవస్థను పునరుజ్జీవింప జేయడమేనని చెప్పవచ్చు. ఇది వర్తమాన రాజకీయ కర్తవ్యం. అదలా ఉంచితే భారత రాజకీయాలకు సంబంధించిన బాగా ఆసక్తికరమైన విశేషం ఈనాటి ప్రాంతీయ పార్టీలలో అనేకం కాంగ్రెస్ విశ్వం నుంచి ప్రభవించినవి కావడమే. మమతా బెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ మూలాలు కాంగ్రెస్‌లోనే ఉన్నాయి. ఆ ప్రాంతీ య పార్టీలన్నీ కాంగ్రెస్ చీలిక వర్గాలు. నాయకత్వ వివాదాలు, రాజకీయ ఆకాంక్షలు, ప్రాంతీయ రాజకీయాల ఒత్తిళ్ల కారణంగా ఆయా ప్రాంతీయ పార్టీల నాయకులు కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకుని స్వంత పార్టీలను నెలకొలుపుకున్నవారే. అయితే విశాల దృష్టితో చూస్తే వారందరూ ఒకే భావజాల ఆవరణంలో ఉన్నవారే, సందేహం లేదు. ఈ పార్టీలన్నీ తమ నామధేయాలు, రాజకీయ అస్తిత్వాల్లో కాంగ్రెస్ ముద్రను ఎందుకు కొనసాగిస్తున్నాయి? ఇందుకు ఒక కారణమున్నది: అవన్నీ కాంగ్రెస్ గర్భాశయం నుంచి పుట్టినవే. గత నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ కుటుంబం వివిధ ప్రాంతీయ పార్టీలుగా చీలిపోయింది. ఆ క్రమంలో బీజేపీ వ్యతిరేక ఓటు చెల్లాచెదురైపోయింది, విభజితమైపోయింది. మరో బలహీన బీజేపీ వ్యతిరేక కూటమిని నిర్మించడానికి బదులు కాంగ్రెస్ చీలిక వర్గాలను పునరేకీకరించే అవకాశాలను ఎందుకు అన్వేషించకూడదు? ఒక విలీనం లేదా కనీసం పరస్పర అవగాహనతో ఒక వ్యవస్థీకృత రాజ కీయశక్తిగా ఏర్పడడం కాంగ్రెస్‌ను పునశ్శక్తిమంతం చేస్తుంది. ఎన్నికలకు కొన్ని నెలల ముందు నానా పార్టీలతో కట్టే కూటమి కంటే పునరుజ్జీవిత కాంగ్రెస్ చాలా మేలు కాదా? ఇదే జరిగితే ప్రతిపక్షాలకు కాంగ్రెస్ ఒక ప్రధాన కేంద్రంగా ప్రభవిస్తుంది. చిన్న చిన్న పార్టీలతో ప్రభావశీలంగా సంప్రతింపులు జరిపేందుకు కాంగ్రెస్‌కు వెసులుబాటు లభిస్తుంది. అటువంటి ఆలోచన నేడు అవాస్తవికమైనదిగా కన్పించవచ్చు. అయితే రాజకీయాలలో అనూహ్య సంభవాలు ఒక సాధారణ సత్యం. గతంలో ఏం జరిగినా, ఇప్పుడు కాంగ్రెస్ కుటుంబం ఇంకా చీలిపోవడాన్ని ఎందుకు అనుమతించాలి? ఏకీకృత కాంగ్రెస్ ఆలోచన సఫలమవ్వాలంటే, తొలుత కాంగ్రెస్ ఆలోచనలు, ఆచరణల్లో మార్పులు రావల్సిన అవసరమున్నది. ప్రాంతీయ పార్టీలు తిరిగి కాంగ్రెస్ ఛత్రం కిందకు రావాలంటే వాటితో అధికారాన్ని, నాయకత్వాన్ని పంచుకోవడానికి కాంగ్రెస్ అంగీకరించాలి. అయితే ఈ విషయంలో బాధ్యత పూర్తిగా కాంగ్రెస్‌కు మాత్రమే ఉన్నదని భావించడం సరికాదు. ప్రాంతీయ పార్టీల అధినేతలు తమ వ్యక్తిగత అహాలను పక్కన పెట్టి కుటుంబ ఆసక్తులు, స్వల్పకాలిక ప్రయోజనాలకు అతీతంగా ఆలోచించాల్సిన అవసరమున్నది. అన్ని ప్రాంతీయ పక్షాలూ తమ వైయక్తిక ఆకాంక్షలను విశాల జాతీయ రాజకీయ లక్ష్యాలకు లోబరిచినప్పుడు మాత్రమే శక్తిమంతమైన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవిస్తుంది. అప్పుడు మాత్రమే ప్రతిపక్షం.. బీజేపీ వ్యతిరేక శక్తుల సమాహారం స్థాయి నుంచి ఒక సువ్యవస్థిత రాజకీయ ప్రత్యామ్నాయంగా రూపొందగలదు. ఇది మనలను రాహుల్‌గాంధీ వద్దకు తీసుకువస్తుంది. బీజేపీకి ప్రధాన భావజాల సవాల్‌దారుగా రాహుల్ ప్రజల దృష్టిలో ఉన్నారు. గత పది సంవత్సరాలకు పైగా నిరంతర రాజకీయ దాడులను దీటుగా ఎదుర్కొని నిలబడిన రాహుల్ ప్రతిపక్షానికి ఒక పదునైన సైద్ధాంతిక బలాన్ని సమకూర్చడంలో సఫలమయ్యారు. అయితే బీజేపీ వ్యతిరేక భావజాల శక్తిగా ఉండడమే సరిపోదు. ఎందుకని? ఒక వ్యక్తి కేంద్రంగా కాంగ్రెస్‌ను పునర్నిర్మించలేము. కాంగ్రెస్‌కు ఇప్పుడు అనుభవజ్ఞులైన ప్రాంతీయ నాయకులు, యువ నేతలు, సంస్థాగత సామర్థ్యం, విభిన్న రాజకీయ పక్షాలతో సర్దుకుపోయేందుకు మరింత సుముఖత చూపే విశాల వైఖరి చాలా అవసరం. మరీ ముఖ్యంగా అందరినీ కలుపుకుపోగల రాజకీయపక్షంగా వ్యవహరించడంలో తన స్వతస్సిద్ధ సామర్థ్యాన్ని మళ్లీ చూపాలి. 2024 సార్వత్రక ఎన్నికలలో ప్రతిపక్షాలు ఒక పెద్ద తప్పు చేశాయి. తమ తరఫున ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో స్పష్టంగా ప్రకటించకపోవడమే ఆ ఘోర తప్పిదం. ఒక విశ్వసనీయ ఉమ్మడి నాయకత్వ నిర్మాణాన్ని సృష్టించడంలో వైఫల్యానికి అదొక తార్కాణం. ఇటీవలి భారత రాజకీయాలలో ఒక గొప్ప సంభావ్యతగా మిగిలిపోయిన నేత నితీశ్ కుమార్. ఆయన రాజకీయ ప్రస్థానం 'ఒకవేళ అలా జరిగి ఉంటే' అన్న ఆసక్తికరమైన ప్రశ్నగా మిగిలిపోయింది. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు తమ ఆకాంక్షలను పక్కన పెట్టి నితీశ్‌ను కూటమి కన్వీనర్‌గా ప్రకటించి, ఆయన నాయకత్వానికి సాధికారత కల్పించి ఉంటే అద్భుతం జరిగి ఉండేది కాదూ? చరిత్ర చాలా అరుదుగా మాత్రమే రెండో అవకాశాన్ని కల్పిస్తుంది. 2029 సార్వత్రక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ప్రతిపక్షాలు ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకు వాటికి రెండు మార్గాలున్నాయి: పాత సంకీర్ణాన్ని ఒక కొత్త పేరుతో పునరుద్ధరించి, గెలవడానికి ప్రయత్నించడం లేదా ఒకప్పుడు ఉమ్మడి వారసత్వాన్ని కలిగివున్న రాజకీయ శక్తుల పునరేకీకరణ ద్వారా వాస్తవ మార్పులకు పూనుకోవడం. విపక్షాలు ఈ రెండిటిలో ఒకదాన్ని ఎంచుకోవాలి. మొదటిదాని వల్ల ప్రయోజనముండదు. రెండోది సత్వరమే జరగాలి. దీని ద్వారా మాత్రమే వాస్తవ మార్పులకు అవకాశమున్నది. రాజకీయ పునరేకీకరణ కాంగ్రెస్‌ను కేంద్ర స్థానంలో నిలబెడుతుంది. ప్రాంతీయ పార్టీల నాయకులు మరింత బృహత్తర పాత్ర నిర్వహించేందుకు ఆస్కారమిస్తుంది. మరీ ముఖ్యంగా ఓటర్లకు ఒక స్పష్టమైన పోటీని ప్రతిపాదిస్తుంది. ఆ పోటీ ప్రాబల్య బీజేపీ, పునశ్శక్తిమంతమైన కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రత్యామ్నాయానికి మధ్య అని ఓటర్లకు విశదమవుతుంది. సినిమాలో వలే రాజకీయాల్లో కూడా ఒకే కథనం రెండుసార్లు ఆదరణకు, ఆమోదానికి నోచుకోదు. చెప్పవచ్చినదేమిటంటే, ఇండియా కూటమి 2.0 ఒక సీక్వెల్. ప్రతిపక్షానికి నిజంగా అవసరమైనది కాంగ్రెస్ నాయకత్వంలో ఒక నిజమైన రాజకీయ పునఃప్రారంభం.

# గూడెం గడ్డపై అభివృద్ధి సందడి





-గూడెం ఆలయానికి భారీ అభివృద్ధి నిధులు..
-రూ.74.40 కోట్ల సాగునీటి పనులకు శ్రీకారం..
- భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపనలు..
-రైతులు..భక్తులకు డబుల్ గుడ్‌న్యూస్..

హంస కలం వార్త జూన్ 13 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

ఆధ్యాత్మికాభివృద్ధి, సాగునీటి సదుపాయాల విస్తరణ, గ్రామీణ మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మంచిర్యాల జిల్లాలో కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దండేపల్లి మండలం గూడెంలో శ్రీ రామా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులతో పాటు రైతులకు మేలు చేసే ఎత్తిపోతల సాగునీటి పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో జిల్లాలో అభివృద్ధికి కొత్త ఊపు లభించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గూడెం దేవస్థానం అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక క్షేత్రాలను మరింత అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా రూ.74.40 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల సాగునీటి పథకాల నిర్మాణ పనులు ప్రారంభించడం వ్యవసాయ రంగానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆదాయం పెరిగి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మంచిర్యాల జిల్లా అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జై సింగరేణితో సభ దద్దరిల్లింది..

-10 వేల పెన్షన్ వరకు పోరాటం: వంశీకృష్ణ..
-సింగరేణి కార్మికుల పక్షాన ఎంపీ గళం..
-కిషన్ రెడ్డికి బహిరంగ సవాల్..
-జై సింగరేణి నినాదాలతో సభ హోరెత్తింది..

హంస కలం వార్త జూన్ 13 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు, పదవీ విరమణ అనంతర జీవన భద్రత వంటి కీలక అంశాలపై మరోసారి చర్చకు తెరలేపుతూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యలు కార్మిక వర్గంలో కొత్త ఆశలు రేకెత్తించాయి. సింగరేణి కార్మికుల పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచే లక్ష్యంతో పార్లమెంట్‌లో నిరంతరం పోరాడుతానని ఆయన చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సింగరేణి వైద్యపరంగా విధులకు అనర్హులైన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఆధారిత నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ, కార్మిక నాయకులు సీతారామయ్య, జనక్ ప్రసాద్, వినోద్, చారి, సింగరేణి సంస్థ చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన అధికారులు, జిల్లా కలెక్టర్ కుమార్



దీపక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో దివంగత కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సంస్థను కాపాడటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సింగరేణి కార్మికులకు పెన్షన్ విధానం అమలులోకి రావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. సింగరేణి కార్మికుల సమస్యలను తాను తరచూ పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్నానని, భవిష్యత్తులో కూడా వారి హక్కుల కోసం రాజీపడని పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. కార్మికుల పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచే దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సవాల్ విసురుతూ, సింగరేణి కార్మికులపై నిజమైన ప్రేమ ఉంటే వారి పెన్షన్ పెంపుపై కేంద్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకునే ధైర్యం చూపాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ విజయానికి



కార్మికుల పోరాట స్ఫూర్తి, త్యాగాలే పునాది అని పేర్కొంటూ వారి సేవలను ఎప్పటికీ మరువరాదన్నారు. అలాగే కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. వైద్యపరంగా విధులకు అనర్హులైన కార్మికుల కుటుంబాలకు ఆధారిత ఉద్యోగాలు త్వరితగతిన అందేలా వైద్య బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే తన లక్ష్యమని స్పష్టం చేసిన గడ్డం వంశీకృష్ణ, జై సింగరేణి...జై జై సింగరేణి అంటూ కార్మికులకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు సభలో హర్షధ్వానాల మధ్య మార్మోగాయి.

# ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా జేఎన్‌టీయూహెచ్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు

- చల్ల రామకృష్ణ రెడ్డి

( జూన్ - 13- హంస కలంవార్త )

హైదరాబాద్ జేఎన్‌టీయూహెచ్: ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా ్రాష్ట్రణ స్కాలర్ చల్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఎల్.సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌డీ స్కాలర్స్ చల్లా రామ కృష్ణ రెడ్డి, పితాని సందీప్ గౌడ్ , బీటెక్ విద్యార్థులు జయరామ్, సాయి రామ్, స్పందన, సరయు, సంపత్,మనీష్, విశ్వజిత్, యశోవర్ధన్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకులు కుమార్ యాదవ్, భరత్ వీర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రకృతి బాగుండాలి గ్రీనరీ పెరగాలి అనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు రామకృష్ణ రెడ్డి తెలిపారు.



## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారాన్ని తగ్గించేది ఎవరు?


-ముల్కల్ల రాజేంద్రప్రసాద్ బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు



హంస కలం వార్త జూన్ 13 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది, యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతుండటంతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. మంచిర్యాల జిల్లాలో ప్రవేట్ పాఠశాలలు ఫీజులను తమ ఇష్టానుసారంగా పెంచేసి తల్లిదండ్రుల శ్రమ మరియు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నాయని అన్నారు ముల్కల్ల రాజేంద్రప్రసాద్.ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఫీజుల భారాన్ని తగ్గించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్. లేనియెడల జిల్లా విద్యాశాఖ అధికారి మరియు జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకుపోతాము అన్నారు ముల్కల్ల రాజేంద్రప్రసాద్.

## వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు




( జూన్ - 13- హంస కలంవార్త )

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శనివారం రోజు కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు. ర్షపు నీటితో నిండిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు అన్ని పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## శనివారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు







( జూన్ - 13- హంస కలంవార్త )

కెపిహెచ్బి లోని అల్లూరి సీతారామరాజు స్పోర్ట్స్ గ్రౌండ్లో క్షత్రియ క్రీడోత్సవం కమిటీ వారు డి.వి.ఎస్ వర్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాలీబాల్ ..టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ను ప్రారంభించడం జరిగింది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ క్షత్రియ క్రీడోత్సవం కమిటీ వారిని అభినందిస్తూ.. క్రీడల పట్ల యువతకు ప్రోత్సాహం అందిస్తూ ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని... అలాగే తల్లితండ్రులు కూడా పిల్లలకు చదువుతోపాటు ప్రతిరోజు ఒక గంట సమయం వారికున్న అభిరుచినిబట్టి ఆ క్రీడలలో పాల్గొనే విధంగా చూడాలని... దీంతో పాటు వారి మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా ఎంతో మెరుగుపడుతుందని.. ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా ఏదో ఒక వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో.. మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు,శ్యామల రాజు, మైనర్ రాజు, డిఎస్ రాజు ,భీమరాజు వెంకటేశ్వరరాజు మరియు ఎస్. ఆర్ .స్పోర్ట్స్ సభ్యులు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## కలెక్టరేట్ ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి.

-యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి.

-కలెక్టర్ చిత్రా మిశ్రా.



( జూన్ - 13- హంస కలంవార్త )

నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు పూర్తవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం.



( జూన్ - 13- హంస కలంవార్త )

మంచిర్యాల జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో కరీంనగర్ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొద్దిసేపు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆగారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి జిల్లాలోని తాజా పరిస్థితులు, జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, ఆర్డీవో షర్మిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 1.43 కోట్ల రూపాయలతో నిర్మించిన మావల పి ఎచ్ సీ భవనం ప్రారంభించిన

-మంత్రి జూపల్లి కృష్ణారావు



( జూన్ - 13- హంస కలంవార్త )

1.43 కోట్ల రూపాయలతో నిర్మించిన మావల పి ఎచ్ సీ భవనం ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం మావల మండల కేంద్రం బట్టిసావర్గాం గ్రామంలో 1.43 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు గోడం నగేష్,స్థానిక శాసన సభ్యులు పాయల శంకర్,జిల్లా కలెక్టర్ రాజర్షిషా లతో కలిసి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాధన, స్థానిక ప్రజాప్రతినిధులు,వైద్య శాఖ సిబ్బంది,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పాపం.. బడి పంతుళ్లు...!

-లెక్కలేని సెలవులు.. లెక్కకు రాని పనులు

-సెలవులు అన్నమాటే గానీ, సర్వం పనులు

-పనులు చేయించుకోవడంలో ప్రథమ స్థానం

-ప్రభుత్వ ఉద్యోగులందరిలో ప్రత్యేక స్థానం

-అలవెన్సు వర్తింపుల్లో అందరిలో ఆఖరి స్థానం

-ప్రభుత్వం గుర్తించడంలోనే అలసత్వం

-నిర్వేదంలో తెలంగాణ ఉపాధ్యాయ లోకం

-వేసవిలోనూ మాస్టర్లకు తప్పని డ్యూటీలు

-అదనపు శిక్షణలు,అడ్మిషన్ల బాధ్యతలు

-ఉపాధ్యాయ వర్గాల్లో ఆవేదన, ఆందోళన

( జూన్ - 13- హంస కలంవార్త )

ఉపాధ్యాయులు..పంతులు మాస్టార్లు..టీచర్లు..సార్లు..ఇలా ఎన్నో పేర్లతో పిలవచ్చే..అంతేస్థాయిలో వీరు వివిధ రకాల పనులు,విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.టీచర్లా..వాళ్లకేంటీ 365 రోజుల్లో 180 రోజులే పని చేస్తారు.ఏడాది వేతనాలు తీసుకుంటారనే భావన జనమందరిలో నాటుకుపోయింది. మోసే వాడికే కావడి బరువు తెలుస్తుందన్నట్టు వారు ఎదుర్కొంటున్న బాధలు మరో ఉపాధ్యాయుడికే అర్థమవుతాయి. సెలవుల విషయంలో తప్ప ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మధ్య చాలా వైరుధ్యాలు ఉంటాయనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రజా సంబంధమైన పలు కార్యక్రమాలకు ప్రభుత్వాలు ఉపాధ్యాయులనే ఉపయోగించుకుంటారని అందరికీ తెలిసిందే.మరి ఉద్యోగులు వారికి హోదాకు తగిన విధులే నిర్వర్తిస్తుంటారు.అయినా ఉపాధ్యాయులంటే..అన్ని సెలవులే అనే అభిప్రాయాలపై టీచర్ల వర్గంలో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. సెలువుల్లో విద్యార్థులకు బండెడు ఇంటిపని ఎలా ఉంటుందో? తమ పరిస్థితి కూడా అలాగే ఉందని ఉపాధ్యాయ లోకం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

### -ఎండలో సమాజం బాట

ప్రస్తుతం వేసవికాలంలో ఎండలు దంచి కొడుతున్నాయి.అవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లకూడదని ప్రభుత్వం,వైద్య నిపుణులు సూచిస్తున్నారు.ఎండల వేళ పాటించాల్సిన జాగ్రత్తలను పదేపదే వల్లిస్తున్నారు.ఈ సూచనలు ప్రస్తుతం జనాభా లెక్కల కోసం సమాజం బాట పట్టిన ఉపాధ్యాయులకు వర్తించవా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏడాదికి అదనంగా ఒక్క నెల అలవెన్సుగా అదనపు వేతనం పొందుతున్న ఉద్యోగులు,ఆఫీసుల్లో ఏసీ గదుల్లో పని చేస్తుంటే... ఎండలో తిరుగుతున్న ఉపాధ్యాయులకు వెకేషన్ డిపార్ట్మెంట్ అనే ట్యాగ్ వేసి.. అలవెన్సుల్లో ఉద్యోగులకంటే తక్కువ చూడడం ఎంతవరకు సమంజసం అనే వాదనలు వినిపిస్తున్నాయి.సెలవులు ఇచ్చినట్టే ఇచ్చి..శిక్షణ తరగతులు, ఎన్నికల విధులు,జనాభా లెక్కలు, అడ్మిషన్లు,ఆఫీసు పనులు,సర్వేలు, సంతకాలు అంటూ ఉపాధ్యాయుల శ్రమను వాడుకుంటున్న ప్రభుత్వాలు...అలవెన్సుల విషయంలో ఉద్యోగుల కంటే చులకనగా చూడడం తగదనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.
అలవెన్సుల వర్తింపులో ప్రభుత్వ ఉద్యోగులందరినీ (ఉపాధ్యాయుల సహా) ఒకేవిధంగా చూడాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

### -ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు సెలవుల్లో తేడా

ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువగా ఉంటాయనేది వాస్తవమే. అంతేకాదు,టీచర్లకు సెలవుల రోజుల వేతనం (ఏడాది మొత్తం) కూడా ప్రభుత్వం కట్టిస్తుంది.ఇదిలా ఉంటే..ప్రభుత్వ ఉద్యోగులకు 12నెలలతో పాటు అదనంగా ఒక నెల వేతనం పొందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా ఏ ఉద్యోగికైనా ఏడాదికి క్యాజువల్ లీవులు (సీఎల్),ఎర్న్ లీవులు (ఈఎల్స్) కేటాయిస్తారు.ఇవి కాక,పండుగలు, జాతీయ స్థాయి వేడుకల కు ప్రత్యేక హాలీడేస్ ఉంటాయి.అయితే, ఉపాధ్యాయులకు మాత్రం ఈఎల్స్ ఉండవు.ఈ ఈఎల్స్ ను ప్రభుత్వ ఉద్యోగులు ఏడాది ముగింపులో ప్రభుత్వానికి సరెండర్ చేస్తుంటారు. అందుకు ప్రభుత్వం సుమారు 30 రోజులు అంటే అదనంగా ఒక నెల వేతనం చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వ సర్వీస్ రూల్స్ వెల్లడిస్తున్నాయి.

### -హాలీడేస్ కాదు..కూలీడేస్

ఈఎల్స్ మినహాయిస్తే..ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులకు పండుగలు,జాతీయ స్థాయి వేడుకలు,సెలవులు ఒకేలా ఉంటాయి.అయితే ఉపాధ్యాయులకు వీటితోపాటు వేసవి సెలవులు దాదాపు 45 రోజులు అదనంగా పొందుతారు. అందుకే అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉపాధ్యాయ వర్గాన్ని వెకేషన్ డిపార్ట్ మెంట్గా ముద్రవేశారు. అయితే,ఈ లెక్కలు ఎలా ఉన్నా.. ఎక్కువ హాలీడేస్ అన్నమాటే గానీ.. అవి కూలీ డేస్ గా మారు తున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రజాసంబంధమైన పలు కార్యక్రమాలకు ఉపాధ్యాయులనే వినియోగిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.ఉదాహరణకు ప్రస్తుతం తెలంగాణలో జనాభా లెక్కల కార్యక్రమం కొనసాగుతున్నది.ఈ బాధ్యతలను ప్రభుత్వం ఉపాధ్యాయులకే అప్పగించింది.ఇదొక్కటే కాదు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సం ఖ్యను పెంచే బాధ్యతలు కూడా ఉపాధ్యాయుల మీదే పడ్డాయి.ఈ మేరకు టీచర్లు ఏటా వేసవి సెలవుల్లో ప్రభుత్వం నిర్దేశించిన బడిబాట కార్యక్రమం కూడా నిర్వహించాల్సి వస్తోందని అందరికీ తెలిసిందే.ఇంకా




సెలవుల్లోనే ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తుంటారని తెలుస్తోంది. సెలవుల్లో విద్యార్థులకు ఇంటి పని ఇచ్చినట్లుగా..ప్రభుత్వం ఉపాధ్యాయులకు పలు రకాల పనులు అప్పగించడం..ఎక్కువ సెలవులు అన్నమాటకు అర్థమే లేకుండా పోయిందని పలువురు పంతుళ్లు వాపోతున్నారు.

### -బోధనతోపాటు భోజన బాధ్యతల్లోనూ

అయినా ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువే అనుకున్నా.. విధుల విషయంలో ఉద్యోగుల కంటే ఉపాధ్యాయులపై పని భారం ఎక్కువగా ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సాధారణంగా ఉద్యోగులు..తమకు నిర్దేశించిన విధులకే పరిమితమవుతారు.కానీ, ఉపాధ్యాయులు తమ ప్రధాన విధి బోధనతోపాటు పాఠశాల నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.ఈ విధులు ఒక ఎత్తయితే, మధ్యాహ్న భోజన నిర్వహణ ఉపాధ్యాయులే చూసుకోవాల్సి ఉంటుంది. భోజనానికి అవసరమైన వస్తువుల సేకరణ,వినియోగానికి సంబంధించి, రికార్డులు మెయింటెన్ చేయాలి. వాటికి సంబంధించిన బిల్లుల కోసం మండలం, జిల్లా విద్యా శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాలి. బిల్లుల విడుదలకు ట్రెజరీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉంటుంది.ఇక విద్యార్థుల సంఖ్యను తగ్గకుండా చూసుకోవడం తలకు మించిన భారమని అందరికీ తెలిసిందే.ఇన్ని బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు రెండు రోజులు సెలవులిచ్చి..అసౌకర్యాల నడుమ ఎన్నికల విధులు కూడా వారికే అప్పగించడం అదనపు భారమే కదా.ఇలా చెప్పుకుంటూ పోతే ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగానే శ్రమిస్తున్నారని స్పష్టమవుతోంది. అయినా ఉపాధ్యాయ వర్గం వెకేషన్ డిపార్ట్మెంట్గానే ముద్రపడింది. సెలవుల్లో కూడా వేతనం తీసుకుంటున్నందున ఉద్యోగులకు వర్తిస్తున్న ఈఎల్స్ కు ఉపాధ్యాయులను అనర్హులుగా గుర్తించి.. 'ఆచార్యదేవో భవ' సూక్తిని నిజం చేస్తున్నారా? నిట్టూర్పుతున్నారా? ప్రభుత్వమే సెలవివ్వాలి.

# ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

-రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

( జూన్ - 13- హంస కలంవార్త )

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.శనివారం మంచిరర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని గూడెంలో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను రాష్ట్ర ఐ.టి,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసన మండలి సభ్యులు దండే విఠల్,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం నియోజకవర్గాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మంచిర్యాల,రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహంకాళి స్వామి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో చర్యలు తీసుకుంటున్నామని, సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని,రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు 802 కోట్ల రూపాయలతో ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజల ఆకాంక్ష మేరకు 70 కోట్ల రూపాయల నిధులతో గూడెం దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగు తుందని,పిప్రి వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి చే గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 37 రోజుల వ్యవధిలోనే పనులు చేపట్టడం జరుగుతు ందని తెలిపారు.రాష్ట్రంలో ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా గూడెం గుట్ట పరిధిలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు.విద్య,వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో విద్య,వైద్యం, వ్యవసాయ,ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిలో నియోజకవర్గ శాసనసభ్యులు కృషి అభినందనీయమని తెలిపారు.మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్తులో ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ఐ.టి.శాఖ మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు.రాబోవు గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.మంచిర్యాల శాసన సభ్యులు



మాట్లాడుతూ...గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని ,ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.అనంతరం పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 70 లక్షల రూపాయల మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సంఘ భవనాల నిర్మాణం,లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో సి.సి.రోడ్డు పనులు,2 కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలో 58 ఓట్ల రూపాయల అంచనా నిధులతో ఆలయ పున:నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, లక్షెట్టిపేట,దండేపల్లి మండలాలలోని మోదెల, ద్వారక,గుడిరేవు గ్రామాల సమీపంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమవైపున 74 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా నిధులతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

-రిమ్మ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
-ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
-లైబ్రరీకి 10 లక్షల రూపాయలు మంజూరు
-రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

( జూన్ - 13- హంస కలంవార్త )

జిల్లా ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని,ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.శనివారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో పర్యటించిన ఆయన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులు నైతం కవిత-సోము, తొడసం సుదర్శన్-మధుబాయి, సీతాబాయి-దేవురావు కుటుంబాలకు చెందిన నూతన గృహాలను మంత్రి పరిశీలించి, ప్రభుత్వ సహాయంతో సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ...రిమ్మ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటి వరకు 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హులైన కుటుంబాలకు అదనపు గృహాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణానికి





చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు,సామాజిక భద్రతా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లా డుతూ, నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు.రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చిట్టచివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి,ప్రజాప్రతి నిధులు,వివిధ శాఖల అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్

( జూన్ - 13- హంస కలంవార్త )

జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో పాటు ధర్మపురి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని , సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను,పరిశీలించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ కి సూచించారు.కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి



గ్రామశీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి,ప్రజలతో మమేకమై శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐలు మహేష్, రవీందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై వైరా పోలీసుల ఉక్కుపాదం..

-వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ఇసుక మాఫియాపై కఠిన చర్యలు..
-అక్రమాయ్కులపై హిస్టరీ షీట్లు తెరిచేందుకు చర్యలు చెపట్టిన..
-వైరా ఏసీపీ సారంగపాణి

( జూన్ - 13- హంస కలంవార్త )

వైరా పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి చెందిన సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలిగిస్తూ.. వ్యవస్థీకృత కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఇసుక మాఫియాపై వైరా పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. వైరా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీలలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం దొనబండ రీచ్ నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, మైనింగ్ పర్మిట్లు, ట్రాన్స్‌పోర్ట్ చలానాలు, ఈ-వే బిల్లులు లేకుండా సుమారు 25 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఖమ్మంకు చెందిన చల్లమల్ల వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు చల్లమల్ల సుమంత్ కుమార్, అలాగే లారీ డ్రైవర్ కొండేటి ఉపేందర్లను అరెస్టు చేశారు. ఇసుక రవాణాకు ఉపయోగించిన అశోక్ లేలాండ్ లారీ, ఎస్కార్ట్ వాహనంగా వినియోగించిన మహీంద్రా థార్ కారు, విక్రయాల కోసం ఉపయోగిస్తున్న టిప్పర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితులు ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి, ఖమ్మం మరియు తెలంగాణలోని



ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి అక్రమ లాభాలు పొందుతున్నట్లు అంగీకరించారు. ఈ సందర్భంగా నిందితుల నేర చరిత్రను పరిశీలించగా, చల్లమల్ల సుమంత్ కుమార్‌పై మొత్తం 12 క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, వాటిలో పలు కేసుల్లో శిక్షలు కూడా విధించబడ్డాయి. అదేవిధంగా, చల్లమల్ల వెంకటేశ్వరరావుపై ప్రస్తుతం నమోదైన ఈ కేసుతో కలిపి మొత్తం 4 కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా అక్రమ ఇసుక రవాణా, దొంగతనం, మోసం వంటి నేరాల్లో వీరు ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. అలవాటుగా నేరాలకు పాల్పడుతున్న ఇటువంటి వ్యక్తులపై హిస్టరీ షీట్లు ప్రారంభించడం, నిరంతర నిఘా ఏర్పాటు చేయడం, అవసరమైతే రౌడీ షీట్లు తెరవడం వంటి కఠిన చర్యలు చేపట్టబడతాయి.

-వైరా పోలీసుల కఠిన హెచ్చరిక

అక్రమ ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, కొనుగోలు లేదా విక్రయాలలో పాల్గొనే వ్యక్తులు, వాహన యజమానులు, డ్రైవర్లు, సహకరించే మధ్యవర్తులు ఎవరైనా సరే చట్టం ముందు తప్పించుకోలేరు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే, పర్యావరణాన్ని దెబ్బతీసే ఇటువంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, వాహనాలను స్వాధీనం చేసుకోవడం, హిస్టరీ షీట్లు తెరవడం, పునరావృత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం వంటి చర్యలు కచ్చితంగా అమలు చేయబడతాయి. ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణా లేదా వ్యాపారం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి చట్ట పరిరక్షణలో భాగస్వాములు కావాలని వైరా పోలీసులు విజ్ఞప్తి చేశారు.క్రమ ఇసుక మాఫియాకు వైరా పోలీసుల స్పష్టమైన హెచ్చరిక -- చట్టాన్ని ధిక్కరించే వారికి కఠిన శిక్షలు తప్పవు. అక్రమ ఇసుక రవాణా ఏ రూపంలోనైనా సహించబడదు ని ఏసీపి సారంగపాణి తెలిపారు .ఈ కార్యక్రమంలో వైరా సీఐ వెంకటప్రసాద్, ఎస్సైలు పుష్పల రామారావు, పవన్ కుమార్, సూరజ్, నరేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాలు, విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు




( జూన్ - 13- హంస కలంవార్త )

జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ, వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చూడాలన్నారు. బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లో మరుగుడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే, ఈ నెల 20వ తేదీ లోపు వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విద్యా సంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రభుత్వ విద్యా సంస్థలలో పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, నిర్వహణాపరమైన లోపాలు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఎస్.సీ.డీ.ఓ రజిత, జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, ఆర్.సీ.ఓ కు, సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, స్పెషలాఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేరెళ్ల బాధితులకు ఇకనైనా న్యాయం చేయాలి

-తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

( జూన్ - 13- హంస కలంవార్త )



నేరెళ్ల బాధితులకు ఇకనైనా న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నేరెళ్ల బాధితులు కల్వకుంట్ల కవితతో సమావేశమయ్యారు. సిరిసిల్ల జిల్లాలోని మానేరు నది నుంచి ఇసుక అక్రమ రావాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమపై అప్పటి ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును బాధితులు వివరించారు. నేతల పరామర్శలే తప్ప తమకు న్యాయం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుంట్ల కవిత స్పందిస్తూ నేషనల్ ఎస్సీ కమిషన్, తెలంగాణ ఎస్సీ కమిషన్ నేరెళ్ల ఘటనపై విచారణ జరిపి రూపొందించిన నివేదికలు వెలుగు చూసేలా తాము ఒత్తిడి తీసుకువస్తామన్నారు. నేరెళ్ల బాధితులను రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకున్న కాంగ్రెస్, బీజేపీలు వారికి న్యాయం చేయడానికి మాత్రం అందుకు రాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచిన తర్వాత కూడా నేరెళ్ల బాధితులకు న్యాయం జరగకపోవడం అత్యంత విచారకరమన్నారు. అడ్వొకేట్ జనరల్ ప్రత్యేక చొరవ తీసుకుని నేరెళ్ల బాధితుల పక్షాన గట్టి వాదనలు వినిపించి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేరెళ్ల బాధితులు కోల హరీశ్, పెంట బానయ్య వారి కుటుంబ సభ్యులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. టీఆర్ఎస్ కు నేరెళ్ల బాధితుడి విరాళం తెలంగాణ రక్షణ సేన పార్టీకి నేరెళ్ల బాధితుడు పెంట బానయ్య విరాళం ఇచ్చారు. శనివారం పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవితకు రూ.10 వేల విరాళం అందజేశారు. తమ పక్షాన గొంతు విప్పి న్యాయం చేయాలని కల్వకుంట్ల కవిత కోరుతున్నారు.. ఆమె స్థాపించిన టీఆర్ఎస్ పార్టీకి తన వంతు సాయంగా విరాళం అందజేశానని చెప్పారు.

# స్పోర్ట్స్

# బిజినెస్

## 87 బంతుల్లో 103 రన్స్

**– రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ సోదరుడు**



వైభవ్ సూర్యవంశీ స్టయిల్‌లోనే అతని తమ్ముడు ఆశీర్వాద్ రెచ్చిపోయాడు. బీహార్ లోకల్ క్లబ్‌లో అతను సెంచరీ కొట్టాడు. 87 బంతుల్లో 103 రన్స్ చేశాడు. ఈ నేపథ్యంలో తమ్ముడు ఆశీర్వాద్‌కు వైభవ్ సూర్యవంశీ తన సోషల్ మీడియాలో కంగ్రాట్స్ తెలిపారు. అన్న స్టయిల్‌లోనే తమ్ముడు కూడా రెచ్చిపోతున్నాడు. యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ తమ్ముడు ఆశీర్వాద్ కూడా తన బ్యాట్‌తో అలరిస్తున్నాడు. సమస్తిపూర్‌లో జరిగిన ఓ లోకల్ మ్యాచ్‌లో.. ఆశీర్వాద్ సూపర్ సెంచ కొట్టేశాడు. ఒకవైపు వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ మ్యాచ్‌లపై దృష్టి పెడుతుండగా, ఇక అతని తమ్ముడు ఆశీర్వాద్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నాడు. తాజ్‌పూర్ క్రికెట్ అకాడమీ తరపున ఆడుతున్న ఆశీర్వాద్ 87 బంతుల్లో 103 రన్స్ చేశాడు. దాంట్లో 20 ఫోర్లు, ఓ సిక్సర్ ఉన్నాయి. అతను 118.39 స్ట్రయిక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ఆశీర్వాద్ సెంచరీ కొట్టిన తర్వాత .. సోషల్ మీడియాలో వైభవ్ సూర్యవంశీ తన సోదరుడికి కంగ్రాట్స్ చెప్పాడు. మరో వైపు జాతీయ జట్టుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీ ఫ్యామిలీపై ప్రశంసలు కురుస్తున్నాయి. గ్రామస్థులు ఇంటికి వచ్చి విషెస్ చెబుతున్నారని, స్వీట్లు.. లడ్డూలు పంచుతున్నారని తండ్రి సంజీవ్ సూర్యవంశీ తెలిపారు. ఇంటి వద్ద బాణాసంచా కూడా కాల్చామన్నార. చిన్నతనం నుంచి వైభవ్ చాలా కష్టపడ్డాడని, దేశం కోసం ఆడాలన్న తపన అతనిలో ఉందన్నాడు. అతని కష్టానికి ఫలం దక్కిందని, దేశానికి ఆడే సౌభాగ్యం వచ్చిందన్నాడు. వైభవ్ సక్సెస్ పట్ల చాలాచాలా సంతోషంగా ఉందన్నాడు.

## ఫిఫా వరల్డ్ కప్‌లో దుమ్మురేపిన నోరా ఫతేహి

**– కెనడా ఓపెనింగ్ మ్యాచ్‌లో ‘సీర్ సీర్’ సాంగ్‌తో అదరగొట్టిన బ్యూటీ!**



ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా పండుగ ‘ఫిఫా వరల్డ్ కప్ 2026’ ఘనంగా ప్రారంభమైంది. కెనడాలోని టొరంటో సిటీలో జరిగిన రెండవ ఓపెనింగ్ వేడుకలలో స్టేజ్‌పై బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్, గ్లోబల్ ఐకాన్ నోరా ఫతేహి తన పర్ఫార్మెన్స్‌తో దుమ్మురేపింది. కెనడా వర్సెస్ బోస్నియా మ్యాచ్‌కు ముందు జరిగిన ఈ వేడుకల్లో ఆమె వేదికపై నిప్పులు చెరిగే డ్యాన్స్ మూమెంట్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. రెడ్ కలర్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోయిన నోరా ఫతేహి.. ఈ ఫిఫా టోర్నమెంట్ అధికారిక ఆల్బమ్ లోని ‘సీర్ సీర్’ అనే గ్లోబల్ ఫుట్‌బాల్ యాంథమ్‌ను లైవ్‌గా ఆలపించి, డ్యాన్స్ చేసింది. ఈ ప్రదర్శనలో ఆమెతో పాటు ప్రసిద్ధ ఫ్రెంచ్ సింగర్ వెజిడ్రీమ్, ప్రముఖ మ్యూజిక్ ప్రొడ్యూసర్ సంజోయ్ కూడా జతకలిశారు. వీరి ముగ్గురి కాంబినేషన్‌లో వచ్చిన ఈ హై–ఎనర్జీ సాంగ్‌కు స్టేడియంలోని వేలాది మంది అభిమానులు ఫిదా అయిపోయారు. కెనడాలోనే పుట్టి పెరిగిన నోరా ఫతేహి, ఆ తర్వాత బాలీవుడ్‌లో స్టార్‌గా ఎదిగింది. ఇప్పుడు మళ్లీ తన సొంత గడ్డపై, ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఫిఫా వరల్డ్ కప్ వేదికపై పర్ఫార్మ్ చేయడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ఈ ‘సీర్ సీర్’ అనే పాటను మొరాకో ఫుట్‌బాల్ స్టేడియం చాంట్ ఆధారంగా రూపొందించారు. ఇందులో అరబిక్, ఫ్రెంచ్, ఇంగ్లీష్ భాషలతో పాటు బలమైన భారతీయ సంస్కృతి, డ్యాన్స్ ఎలిమెంట్స్ కూడా బ్యాక్‌స్టేజ్‌లో భాగమయ్యాయని నోరా పేర్కొంది. గతంలో 2022 ఖతార్ ఫిఫా వరల్డ్ కప్ ముగింపు వేడుకల్లో అలరించిన నోరా, ఇప్పుడు 2026 ఫిఫా ప్రారంభ వేడుకల్లోనూ మెరిసి మరోసారి అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించింది.


## పరాగ్వేపై 4–1 గోల్స్ తేడాతో అమెరికా విక్టరీ




ఇంగిల్‌వుడ్: ఫిఫా వరల్డ్‌కప్(లో ఆతిథ్య దేశం అమెరికా తొలి విక్టరీ కొట్టింది. గ్రూప్ డీలో పరాగ్వేతో జరిగిన మ్యాచ్‌లో 4–1 గోల్స్ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అమెరికా జట్టులో ఫ్లోరియన్ బలోగన్ రెండు సార్లు గోల్స్ చేశాడు. ఫస్ట్ హాఫ్‌లోనే యూఎస్ఏ మూడు గోల్స్ చేయడం గమనార్హం. టోర్నీ ఆరంభంలోనే ఘనంగా బోణీ కొట్టింది. దక్షిణ కాలిఫోర్నియాలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆది నుంచి అమెరికా జట్టు ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫస్ట్ హాఫ్‌లోనే మూడు గోల్స్ చేయడం.. అమెరికా చరిత్రలోనే ఇదే మొదటిసారి. సెకండ్ హాఫ్‌లో జియో రేనా మరో గోల్ చేశాడు. అయితే వరల్డ్‌కప్ హిస్టరీలో ఒక్క మ్యాచ్‌లో అమెరికా మొత్తం నాలుగు గోల్స్ చేయడం మొదటిసారి. ఖతార్‌లో జరిగిన గత వరల్డ్‌కప్‌లో నాలుగు మ్యాచుల్లో అమెరికా కేవలం మూడు గోల్స్ మాత్రమే చేసింది. ఇప్పటి వరకు ఏ వరల్డ్‌కప్ మ్యాచ్‌లోనైనా మూడు కన్నా ఎక్కువ గోల్స్ ఆ దేశం చేయలేదు. సుమారు 70 వేల మంది ప్రేక్షకులు ఉన్న స్టేడియంలో అమెరికా టీమ్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పరాగ్వే తరపున సెకండ్ హాఫ్‌లో మౌరీసియో ఓ గోల్ స్కోరు చేశాడు. అమెరికా జట్టులో డీ బోడాడిల్లా 7వ నిమిషంలో, ఆ తర్వాత బలోగన్ 31, 45వ నిమిషాల్లో, రేనా 90వ నిమిషంలో గోల్స్ చేశారు. పరాగ్వే ప్లేయర్ మౌరిసియో 73వ నిమిషంలో గోల్ చేశాడు. ఫోలారిన్ బలోగన్ ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ చేశాడు. వాస్తవానికి బలోగన్ ఇంగ్లండ్ లేదా నైజీరియా జట్టుకు ఆడాల్సి ఉంది. కానీ కొన్ని అనూహ్య పరిస్థితుల వల్ల అతను అమెరికాకు ప్రాతినిధ్యం వహించాడు. చివరి దశలో అమెరికా జట్టును ఎంపిక చేయడంతో.. అతను వరల్డ్‌కప్ తొలి మ్యాచ్‌లోనే హీరో అయిపోయాడు. బలోగన్ వయసు 24 ఏళ్లు. బ్రూక్లిన్‌లో నైజీరియన్ జంటకు బలోగన్ పుట్టాడు.

## షావోమీ నుంచి షావోమీ 17టీ ఫోన్ విడుదల

**– బెస్ట్ కెమెరా, పవర్‌ఫుల్ బ్యాటరీ.. పూర్తి ఫీచర్లు, ధర ఇవే**




చైనాకు చెందిన షావోమీ సంస్థ నుంచి షావోమీ 17టీ పేరుతో స్మార్ట్‌ఫోన్ ఇటీవల ఇండియాలో విడుదలైంది. దాదాపు ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో, కాస్త అందుబాటు ధరలోనే ఈ ఫోన్ విడుదలైంది. ఇప్పటికే సేల్‌లో అందుబాటులోకి వచ్చింది. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, క్వాలిటీ ట్రిపుల్ కెమెరా వంటి ఫీచర్లున్నాయి చైనాకు చెందిన షావోమీ సంస్థ నుంచి షావోమీ 17టీ పేరుతో స్మార్ట్‌ఫోన్ ఇటీవల ఇండియాలో విడుదలైంది. దాదాపు ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో, కాస్త అందుబాటు ధరలోనే ఈ ఫోన్ విడుదలైంది. ఇప్పటికే సేల్‌లో అందుబాటులోకి వచ్చింది. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, క్వాలిటీ ట్రిపుల్ కెమెరా వంటి ఫీచర్లున్నాయి. షావోమీ వెబ్‌సైట్, అమెజాన్, రిటైల్ స్టోర్లలోనూ ఈ ఫోన్ అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్ కొంటే ఏడాదిలోపు 60 శాతం బైబ్యాక్ ఆఫర్ కూడా ప్రకటించింది కంపెనీ. ఈ ఫోన్ కొంటే 4 నెలల స్పాటిఫై ప్రీమియం, 3 నెలల యూట్యూబ్ ప్రీమియం, గూగుల్ ఏఐ వంటివి ఉచితంగా పొందవచ్చు. వివిధ కార్డులపై డిస్కౌంట్‌తోపాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్ కూడా ఇస్తోంది. ఈ ఫోన్‌లోని కీలక ఫీచర్లివి. 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్‌ప్లే, 3,500 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్, 120 హెర్జ్ రిఫ్రెష్‌రేట్, మీడియాటెక్ డిమెన్సిటీ 8500 అల్ట్రా ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 బేస్డ్ హైపర్‌ఓఎస్ 3, 50 ఎంపీ లైట్ ఫ్యుజియన్ 800 మెయిన్ కెమెరా+50ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరా+12ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, 12జీబీ+256జీబీ, 12జీబీ+512జీబీ, బ్లూటూత్ 6.0, వైఫై 7, ఐపీ68 రేటింగ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 67 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5 వాట్స్ రివర్స్ ఛార్జింగ్ వంటి ఫీచర్లున్నాయి. ధర రూ.59,999/రూ.64,999.

## 2.5 లక్షల్లో స్క్రాంబ్లర్ బైక్ కొనాలా?




ఈ రెండింటిలో ఏది బెస్ట్? స్క్రాంబ్లర్ బైక్‌లవైపు యూత్ మొగ్గుచూపుతున్న నేపథ్యంలో ఇప్పటికే రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ స్క్రామ్ 440ని అందుబాటులోకి తీసుకురాగా.. ఇటీవల యెజ్డీ నుంచి సరికొత్త స్క్రాంబ్లర్ బైక్‌లు వచ్చాయి. ప్రస్తుతం రూ.2.5 లక్షల్లోపు ధరలో ఈ రెండు బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. మరి వీటిలో ఏది బెస్ట్ అనేది ఒకసారి పరిశీలిద్దాం.. భారత మార్కెట్‌లో అడ్వెంచర్, స్క్రాంబ్లర్ బైక్‌లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. ముఖ్యంగా నగర రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని గుంతలు, కంకర రోడ్లు, తేలికపాటి ఆఫ్‌రోడింగ్ పరిస్థితుల్లోనూ స్మూత్ రైడింగ్ సామర్థ్యంతో ఉండటంతో యూత్ స్క్రాంబ్లర్ బైక్‌లవైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ స్క్రామ్ 440ని అందుబాటులోకి తీసుకురాగా.. ఇటీవల యెజ్డీ నుంచి సరికొత్త స్క్రాంబ్లర్ బైక్‌లు వచ్చాయి. ప్రస్తుతం రూ.2.5 లక్షల్లోపు ధరలో ఈ రెండు బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. మరి వీటిలో ఏది బెస్ట్ అనేది ఒకసారి పరిశీలిద్దాం.. ఇంజిన్–పనితీరు రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో 443సీసీ సామర్థ్యం గల సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 25.4బీహెచ్‌పీ పవర్, 34ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.యెజ్డీ బైక్ బాగా నచ్చే అవకాశం ఉంది. డిజైన్ స్క్రామ్ 440లోసీటు ఎత్తు 795 మిల్లీమీటర్ల ఎత్తులోనే ఉండటంతో పొట్టిగా ఉన్నవారు కూడా సులభంగా నడపగలరు. 200 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉండటం వల్ల గుంతలు, స్పీడ్ బ్రేకర్లపై ఇబ్బంది ఉండదు. దీని వీల్‌బేస్ 1460 మిల్లీమీటర్లు కాగా.. మొత్తం బరువు 196 కిలోలు. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో సీటు ఎత్తు 813 మిల్లీమీటర్ల ఎత్తులో ఉంది. పొడవుగా ఉండే వారికి ఈ బైక్ అనుకూలంగా ఉంటుంది. బరువు విషయానికి వస్తే ఇది స్క్రామ్ 440 కంటే తక్కువ. దీని బరువు కేవలం 174 కిలోలు మాత్రమే. స్క్రామ్‌తో పోలిస్తే 22 కిలోల వరకు తక్కువ బరువు ఉండటంతో ట్రాఫిక్‌లో, టార్నింగ్స్‌లో మరింత చురుకైన హ్యాండ్లింగ్ ఉంటుంది. బ్రేకింగ్–సస్పెన్షన్ రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో ముందు 300మిల్లీమీటర్ల డిస్క్, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. ముందు 41 మిల్లీమీటర్ల టెలిస్కోపిక్ ఫోర్క్‌లు, వెనుక లింకేజ్‌తో కూడిన మోనోషాక్ సస్పెన్షన్ అందించారు. ముందు 190మిల్లీమీటర్లు, వెనుక 180 మిల్లీమీటర్ల సస్పెన్షన్ ట్రావెల్ ఉండటంతో కఠినమైన రోడ్లపై కూడా మంచి సౌకర్యవంతమైన రైడింగ్‌ను అందిస్తుంది. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో ముందు 320 మిల్లీమీటర్లు, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ భద్రత కూడా ఉంది. ముందు టెలిస్కోపిక్ హైడ్రాలిక్ ఫోర్క్, వెనుక ట్విన్ షార్క్ అబ్జార్బర్ల వ్యవస్థను ఉపయోగించారు.

## వడదెబ్బ కాదు –ధరదెబ్బ




మేలో విజృంభించిన రిటైల్ ద్రవ్యోల్బణం ఈసారి మండుటెండల్లో వడదెబ్బ సంగతేమోగానీ.. ధరదెబ్బ మాత్రం అందరికీ గట్టిగానే తగిలింది. కొనుగోలుదారుల జేబుల్ని గుల్ల చేసేలా మేలో రిటైల్ ద్రవ్యోల్బణం విజృంభించింది మరి. అంతకుముందు నెలతో పోల్చితే గత నెలలో దాదాపు 50 బేసిస్ పాయింట్లు ఎగిసి 3.93 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌లో 3.48 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. గత నెలలో 3.93 శాతంగా నమోదు ఆహారోత్పత్తుల రేట్లు పైపైకిభారీగా పెరుగుతున్న ఇంధన ధరలూ కారణమే( ఈసారి మండుటెండల్లో వడదెబ్బ సంగతేమోగానీ.. ధరదెబ్బ మాత్రం అందరికీ గట్టిగానే తగిలింది. కొనుగోలుదారుల జేబుల్ని గుల్ల చేసేలా మేలో రిటైల్ ద్రవ్యోల్బణం విజృంభించింది మరి. అంతకుముందు నెలతో పోల్చితే గత నెలలో దాదాపు 50 బేసిస్ పాయింట్లు ఎగిసి 3.93 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌లో 3.48 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. పెరుగుతున్న పెట్రో ధరలు, ఆహారోత్పత్తుల ధరలే ఇందుకు కారణమని శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. దేశీయ మార్కెట్‌లో మే 15 నుంచి లీటర్ పెట్రోల్, డీజిల్ రేట్లు దాదాపు రూ.8 చొప్పున, గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ ధర సుమారు రూ.90 పెరిగిన సంగతి విదితమే. ఈ క్రమంలో పెరిగిన రవాణా ఖర్చులు.. అన్ని వస్తూత్పత్తుల ధరల్ని ఎగదోస్తున్నాయని ఆర్థిక నిపుణులు ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నారు. ఇప్పటిదాకా పెరిగిన ఇంధన ధరలు.. నేరుగా ద్రవ్యోల్బణాన్ని 36 బేసిస్ పాయింట్లు పెంచాయని తేటతెల్లమవుతున్నది.

# ‘ఆది’ సినిమాకు నాంది పలికింది వడ్డే నవీన్ చిత్రమే


## –వీవీ వినాయక్ ఆసక్తికర వ్యాఖ్యలు



సీనియర్ హీరో వడ్డే నవీన్ దాదాపు పదేళ్ల విరామం తర్వాత హీరోగా నటించిన చిత్రం ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’. దర్శకుడు కమల్ తేజ్ నార్ల తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ కథానాయికగా నటించారు. వడ్డే క్రియేషన్స్ బ్యానర్‌పై స్వయంగా వడ్డే నవీన్ నిర్మించిన ఈ సినిమా జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను ఘనంగా విడుదల చేశారు.ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్ ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డే నవీన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. వినాయక్ మాట్లాడుతూ.. తాను దర్శకుడిగా మారకముందు వడ్డే నవీన్ సినిమాకు దర్శకత్వ విభాగంలో పనిచేశానని తెలిపారు. కో–డైరెక్టర్‌గా చేసిన చివరి సినిమా కూడా నవీన్‌దేనని గుర్తుచేశారు. అదే సమయంలో తన జీవితాన్ని మార్చిన ‘ఆది’ సినిమా అవకాశం వచ్చిందని వెల్లడించారు. నవీన్ గారి సినిమా కోసం స్విట్జర్లాండ్ వెళ్లిన సమయంలోనే నాకు జూనియర్ ఎన్టీఆర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ ప్రయాణమే ‘ఆది’ సినిమాకు నాంది పలికింది. అందుకే నా కెరీర్‌లో నవీన్ గారికి ప్రత్యేక స్థానం ఉంటుంది” అని వినాయక్ పేర్కొన్నారు. అలాగే నవీన్ తనను ఎంతగానో ప్రోత్సహించారని చెప్పారు. నేను రాసిన ఒక సీన్ చూసి నన్ను భోజనానికి పిలిచారు. ఒకరోజు పెద్ద దర్శకుడవుతావని ఆశీర్వదించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కాకుండా దర్శకుడిగా ప్రయత్నించమని ప్రోత్సహించారు. ఏ సహాయం కావాలన్నా తమ కార్యాలయానికి రావాలని చెప్పేవారు. ఎందుకో నాకు ప్రత్యేకమైన ప్రేమ చూపించేవారు అని వినాయక్ తెలిపారు. సీనియర్ హీరో వడ్డే నవీన్ దాదాపు పదేళ్ల విరామం తర్వాత హీరోగా నటించిన చిత్రం ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’. దర్శకుడు కమల్ తేజ్ నార్ల తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ కథానాయికగా నటించారు. వడ్డే క్రియేషన్స్ బ్యానర్‌పై స్వయంగా వడ్డే నవీన్ నిర్మించిన ఈ సినిమా జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఒక ఆసక్తికర సంఘటనను కూడా ఆయన పంచుకున్నారు. స్విట్జర్లాండ్‌లో షూటింగ్ ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో విమానంలో ఓ ప్రయాణికుడు నిబంధనలు ఉల్లంఘించడంతో పోలీసులు అరెస్ట్ చేయడానికి వచ్చారని చెప్పారు. చెన్నై విమానాశ్రయంలో పోలీసులు ఏకే–47 ఆయుధాలతో వచ్చి ఒక ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. అప్పుడు నవీన్ గారు ఒక్క ఫోన్ కాల్ మాట్లాడగానే అతడిని విడుదల చేశారు. ఆయన ప్రభావం చూసి నేను ఆశ్చర్యపోయాను. అంతటి పలుకుబడి ఉన్న వ్యక్తి ఆయన. అయితే ఆయన ప్రతిభకు తగ్గ స్థాయిలో కెరీర్‌ను కొనసాగించలేకపోయారని నేను భావిస్తాను అని వినాయక్ వ్యాఖ్యానించారు. ఇకపై నవీన్ తనకు నచ్చిన కథలనే ఎంపిక చేసుకుని సినిమాలు చేయాలని కోరుకుంటున్నానని, ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’ చిత్రం మంచి విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.


# పెద్ది’ బాక్సాఫీస్ దూకుడు

## 9 రోజుల్లో రూ.366 కోట్ల గ్రాస్, 400 కోట్ల క్లబ్‌కు చేరువ!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన ‘పెద్ది’ తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, ‘పెద్ది’ ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో ‘పెద్ది’ రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది.ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశం, విదేశీ మార్కెట్లలో కూడా సినిమా మంచి వసూళ్లు నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో ‘పెద్ది’ త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.బాక్సాఫీస్ ప్రయాణం ఇంకా కొనసాగుతుండటంతో, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఒకప్పుడు రైలు టాయిలెట్ దగ్గర నిద్ర నేడు వందే భారత్‌లో ప్రయాణం సోనూ సూద్ ఎమోషనల్



ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. అయితే ఈ ప్రయాణంలో రైలు లగ్జరీ సౌకర్యాలను చూసిన ఆయన, ఒక్కసారిగా తన పాత రోజులను గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యారు. ఒకప్పుడు నటుడు అవ్వాలనే కలతో ముంబైలో తను పడ్డ కష్టాలు, రైలు ప్రయాణాల అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. భారతీయ రైల్వే సాధించిన ప్రగతి అద్భుతంగా ఉందంటూ సోనూ సూద్ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. నేను ప్రస్తుతం వందే భారత్ రైలులో ప్రయాణిస్తున్నాను. మన దేశంలో రైల్వేలు ఇంతగా అభివృద్ధి చెందడం నిజంగా గర్వకారణం. ఇక్కడి వసతులు, ఇస్తున్న ఫుడ్, సిబ్బంది ప్రవర్తన, వారు చూపిస్తున్న ప్రేమ అన్నీ చాలా బాగున్నాయి. ఈ ప్రయాణం నా మొదటి రైలు ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చింది. నేను నాగ్‌పూర్‌లో చదువు పూర్తి చేసుకుని, నటుడిని అవ్వాలనే పెద్ద కలతో ముంబైకి బయలుదేరిన రోజులు గుర్తొచ్చాయి అని చెప్పారు. ఆ రోజుల్లో ప్రయాణించడానికి మాకు కనీసం రైలు రిజర్వేషన్ కూడా దొరికేది కాదు. పాడవాటి కంప్యూటర్ పేపర్లను మడతపెట్టుకుని ఎలాగోలా జనరల్ బోగీల్లోకి దూరేవాళ్లం. రాత్రి పూట పడుకోవడానికి చోటు లేక, రైలు టాయిలెట్ దగ్గరే నేలపై పేపర్లు పరుచుకుని పడుకునేవాళ్లం. అలాంటిది, ఇన్నేళ్ల తర్వాత మళ్లీ రైలెక్కితే వ్యవస్థ మొత్తం మారిపోయింది. భారతీయ రైల్వే క్వాలిటీ ఎంతో పెరిగింది. ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. అయితే ఈ ప్రయాణంలో రైలు లగ్జరీ సౌకర్యాలను చూసిన ఆయన, ఒక్కసారిగా తన పాత రోజులను గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యారు. ఇప్పుడు ఎవరూ టాయిలెట్ దగ్గర పేపర్లు వేసుకుని పడుకోవాల్సిన అవసరం లేదు. సామాన్యుల ప్రయాణాన్ని ఇంత సుఖవంతం చేసినందుకు, మన దేశ అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు రైల్వే శాఖకు నా ధన్యవాదాలు. ఇలాంటి మంచి పనులను ఇంకా ముందుకు తీసుకెళ్లాలి అని సోనూ సూద్ కొనియాడారు.

# సమంత సినిమాకు పోటీ తగ్గిందా?

## – ‘మా ఇంటి బంగారం’కు బాక్సాఫీస్ దగ్గర బిగ్ అడ్వాంటేజ్



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మా ఇంటి బంగారం’ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రానికి బాక్సాఫీస్ పరంగా మరో భారీ ప్లస్ పాయింట్ దక్కినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.మొదట ‘మా ఇంటి బంగారం’ విడుదల సమయంలో కొన్ని క్రేజీ సినిమాలు కూడా బరిలోకి దిగనున్నట్లు వార్తలు వినిపించాయి. ముఖ్యంగా అక్కినేని హీరో నటిస్తున్న ‘లెనిన్’ సినిమా అదే సమయంలో విడుదలవుతుందని భావించారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఆ చిత్రం విడుదల వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు ‘లెనిన్’ జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే ‘మా ఇంటి బంగారం’కు బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ ఉండకపోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మా ఇంటి బంగారం’ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ముఖ్యంగా తొలి రెండు వారాల పాటు ప్రేక్షకుల దృష్టిని పూర్తిగా ఆకర్షించే అవకాశం ఈ చిత్రానికి లభించవచ్చని భావిస్తున్నారు. సినిమా విడుదలైన మొదటి వారంలో పాజిటివ్ టాక్ అందుకుంటే, రెండో వారంలో కూడా వసూళ్ల పరంగా బలంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ తగ్గడం సమంత సినిమాకు అదనపు బలంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు ‘లెనిన్’ జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే ‘మా ఇంటి బంగారం’కు బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ ఉండకపోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మా ఇంటి బంగారం’ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు ‘లెనిన్’ జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే ‘మా ఇంటి బంగారం’కు బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ ఉండకపోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మా ఇంటి బంగారం’ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు ‘లెనిన్’ జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే ‘మా ఇంటి బంగారం’కు బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ ఉండకపోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు ‘లెనిన్’ జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మా ఇంటి బంగారం’ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. హాలీవుడ్ యాక్షన్ క్లాసిక్ ‘కిల్ బిల్’ తరహా యాక్షన్ ఎలిమెంట్స్‌ను తెలుగు కుటుంబ కథాంశంతో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే పాత్రలో రెండు భిన్న కోణాలు ఉండనున్నాయని, అవి కథలో కీలక మలుపులకు కారణమవుతాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో సమంత అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. పూర్తిగా ఆమె ఇమేజ్, నటన, కథ బలంపై సినిమా రూపొందుతోంది. లేడీ ఓరియెంటెడ్ జానర్‌లో భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రం విజయవంతమైతే సమంత కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449